మా ఆవిడ నాకు హుషారిచ్చింది. అనవసరంగా పోలీసువాళ్ళతో మాట్లాడ్డం నాకు కొంచెం భయమయినా, ఈ పరిస్థితుల్లో మనం ధైర్యం విడనాడకూడదని గుండె నిబ్బరంచేసుకుని, వాడి సలహా అడిగి, టాక్సీలోయెక్కి దగ్గరలోవున్న ఓ అరవ హోటలు చేరుకున్నాం.

వూళ్ళో చూడవలసిన వింతలు, విశేషాలూ అన్నీ పాపం హోటలువాడే లిస్టు రాసియిచ్చాడు. రెండంతస్తులబస్సులెక్కాం. ట్రాములెక్కాం. మా చిన్నతనంలో మా జమీందారుగారి దగ్గిరుండేది అలాటి గుర్రబ్బండీకూడాయెక్కాం. ఎటొచ్చీ ఆగుర్రం శల్యంలావుంది. తిన్నగా తిండిపెట్టరు కాబోలు. మా జమీందారుగారి బగ్గికి కట్టిన జోడు గుర్రాలూ, మిలమిల్లాడుతూవుండేవి. మోటారుకారుకంటె చవక అని గుర్రంబండిలో ఎక్కితే, రెట్టింపు వొదిలిపోయింది. నిజానికి బొంబాయిలో అంతా అదోతమాషా. చవక అనుకున్నది ఖరీదు. పేరునిబట్టి ఏమీ వూహించుకోడానికి వీల్లేదు. 'గేట్‌వే ఆఫ్ ఇండియా'కి వెళితే అక్కడ గేటు లేదు. 'హేంగింగ్ గార్డెన్స్' చూస్తే, అది నేల మీదే వుందిగాని, ఎక్కడా వేళ్ళాడ్డంలేదు. మలబార్ హిల్సుమీదనించిచూస్తే, క్వీన్సు నెక్లేస్ కనిపిస్తుందన్నారు. కళ్ళుపొడుచుకు చూసినా ఎక్కడా నెక్లేస్ కనిపించలేదు. రాణీబాగ్‌లో కోతుల్నీ, ఆరే కాలనీలో గేదెల్నీచూస్తే బాగానే వున్నాయికాని, కోతుల్నీ, గేదెల్నీ చూడ్డానికి బొంబాయికి వెళ్లాలిట్రా. చెన్నపట్నంలోలా పెద్ద బీచిఅయినాలేదు. ఏదో చపాతట. అదే బీచన్నారు. మా వూళ్ళో యేట్లో వున్నంత ఇసకన్నాలేదు అక్కడ. పైకి చూడ్డానికి యిళ్ళు పెద్దవేగాని లోపల గూళ్ళు. కిక్కిరిసిపోయిన జనం. ఎక్కడికి వెళదామన్నా తోసుకు ముందుకి పోడానికి వీల్లేదుట. ఏదో క్యూట. లైనులో నించోవాలిగంటలకొద్దీ. మొత్తంమీద నాకేకాదు మా ఆవిడకీ బొంబాయి ఏమీనచ్చలేదనుకో. పైగా, చూసినవన్నా ఖలాసాగా, మజాగా కబుర్లుచెప్పుతుంటూ చూద్దామంటే కిష్టయ్యగాడి ఫామిలీ అడ్డు. అన్నిటికీ ఏవో కామెంటరీలు చెబుతూ లెక్చర్లిస్తానంటాడు కిష్టయ్య. కనిపించిందల్లా బేరంచేసి, మా వూళ్లో యింతకంటె చవగ్గా దొరుకుతాయే ఇవి అని, అమ్మే ఆసామీచేత గుడ్లు ఎర్రజేయించుకునేది గంగారత్నం. వీటన్నిటినీ మించి, ఫిలిములో 'బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్'లాగ హమేషా వాడి పిల్లల సన్నాయి మేళం.

ఏమయినా, మాటపట్టుదలొచ్చింది కనక అన్ని కష్టాలకీ వోర్చి లిస్టుప్రకారం అన్నీ చూసి మరీ బొంబాయినించి కదిలాము. కిష్టయ్యగాడు కుదేలయిపోయాడు.

హుఁ. ఏమనుకున్నావురా! నాయనమ్మ బతికుంటే "నాకుతెలుసురా! వెర్రినాగమ్మా. పైకి మెత్తని వాడిలా కనిపించినా, గట్టివాడే రా. చిన్నప్పుడు గుక్కపెడితే పావుగంటదాకా మానేవాడివి కాదు. ఉక్కిరిబిక్కిరి అయిపోయేవాడివి గాని, ఏడుపు మానేవాడివికాదు. అప్పుడే తెలుసురానాకు నువ్వు చాలా గట్టివాడివని." అని మెచ్చుకునేది. ఏడిశావు.... మా ఆవిడా మెచ్చుకుందని చెప్పానుకాదురా! మానాయనమ్మలా, బాహాటంగా కాకుండా, సున్నితంగా, రహస్యంగా, విలాసంగా, చేసిందిరా ఆపని,

దానికీ థాంక్స్. బొంబాయికీ థాంక్స్.

ロロロ



# షాపింగ్ షాన్

*లీలావతి కారుని అల్లూరాం బట్టలషాపు ముందర క్రీక్ మంటూ పార్కుచేసింది. అల్లూరాం గాభరాగా తన మెళ్లోని జరీ ఖండువా, సవరించుకుంటూ "రండి రండి. చాలారోజులకి దయ చేశారు" అని సాదరంగా ఆహ్వానించాడు.*

ఒక్కసారి షోరూమ్ లోని సేల్సుమెన్ కళ్ళు జిగేల్‌మన్నాయి. లీలావతి హందాగా రాజమహల్‌లోని రాజకుమార్తెలా నడిచి వచ్చింది. అల్లూరాం తన బంగారపుపళ్ల అన్నీ బయటకు కనపడేలా నవ్వుముఖం పెట్టి కుర్చీ చూపించాడు. ఒక సేల్సుమేన్ ఫాన్ స్విచ్ ఆన్‌చేశాడు. వేరొక సేల్సుమేన్ "ద్రాక్ష"గ్లాస్ తీసుకవచ్చాడు. షోరూమంతటా, చెదురుమదురుగా వున్న జనం, లీలావతికి జరుగుతున్న సన్మానానికి అద్భుతపడి తమకి కావల్సిన గుడ్డలను ఎన్నుకోవడం మర్చిపోయి, శిల్పాల్లా నిలబడ్డారు. ఒకరిని ఒకరు కనుబొమ్మ లెగరేసుకుంటూ "ఎవ్వరీవిడ? మంత్రిగారి భార్యా లేక మార్కెటింగ్ ఆఫీసరా?" అన్న ప్రశ్న లేసుకుంటూ, వాళ్ళ ప్రశ్నలకి జవాబులుదొరక్క బిక్కముఖాలతో నిలబడ్డారు. స్త్రీ కస్టమర్స్ లీలావతి అందానికి, ఆమె యొక్క వేషభాషలకి, ముచ్చటపడుతూ ఆమె అదృష్టానికీ, తమ నీరసత్వానికీ దిగులుపడ్డారు. పేవ్‌మెంట్ మీద నడిచి పోయే జనం, ఫ్లడ్ లైట్ల వెలుతురులో చేతిలో ద్రాక్ష గ్లాసులోని జ్యూస్‌ని, స్ట్రాతో కొద్దికొద్దిగా పీలుస్తూ, కూర్చున్న లీలావతిని చూసి "ఎవరీ మోనాలిసా!" అని ఆగి చూసి మరీ వెళ్ళుతున్నారు. లీలావతి ద్రాక్ష జ్యూస్‌ని సిప్ చేయటానికి అరగంటపట్టింది. క్రొత్తగా సేల్సుమేన్‌గా వచ్చిన ఫిరోజ్, పాత సేల్సుమేన్ అహమ్మద్‌ని అడిగాడు "ఎవరీవిడ?" అని.

"ఏమో నాకు తెలియదు. కాని ఈవిడ వస్తేమటుకు ఆ రోజు మన వ్యాపారం సాగదు. చూడు! వచ్చి అరగంటపైగా అయిందా? తన కేం కావాలో చెప్పదు. పోనీకూర్చుంటే కూర్చుందిలే. మాడల్‌గా పనిచేస్తుంది అనుకుందామనుకో! మిగిలిన కస్టమర్స్ ఆవిడ్నే చూస్తూకూర్చుంటారు

## కె. వి. ఎస్. అచ్యుతవల్లి

కాని, వాళ్ళకాక్కావల్సినవేవోక్టీ కొనుక్కోరు! షాపు మూసే టైం అయ్యేదాకా అల్లానే. ఆవిడ అందాన్ని గుడ్లప్పగించి చూస్తూ, నిలబడిపోయి, షాపు మూసేవేళకి తొందర తొందరగా వెళ్ళిపోతారు" అన్నాడు అహమ్మద్.

"పోనీ ఈమెగా రేదయినా లార్జ్‌స్కేల్‌లో పర్చేజ్ చేస్తుందా?" అన్నాడు ఫిరోజ్.

"పాపం! చేస్తుందిలే! అయిదారు వందలదాకా!" తేలిగ్గా అన్నాడు అహమ్మదు.

గతుక్కుమన్నాడు ఫిరోజ్.

అయిదారు వందలు! ఎంత తేలిగ్గా అన్నాడు అహమ్మదు? ఒక అందాల రాణి పూనుకొని వచ్చి షాపింగ్ చేసుకునే తీరువ అయిదారు వందల ఖరీదన్నమాట! అదృష్టవతి! కళ్ళనిండుగా చూశాడు ఫిరోజ్ లీలావతిని. లీలావతి పచ్చగా పొడుగ్గావుంది. మెరిసే కళ్ళు! తళతళ్లాడే పళ్ళు! ఎఱ్రని పట్టుమీద జరీగళ్ళువున్న చీర కట్టుకుంది. వంటిరంగులో కలిసే పసుపుపచ్చని టెరిలిన్ స్లీవ్‌లెస్ బ్లవుజు వేసుకుంది. వంకులు వంకులు తిరిగే లావాటి జుట్టుని గట్టిగా బిగించి, నడినెత్తిమీదకు ముడివేసింది. చెవులకి జిప్సీరింగులు, సన్నని పెదాలకు లిప్‌స్టిక్. సన్నగా పొడుగ్గావున్న చేతివ్రేళ్ళకి, క్యూటెక్స్! పెద్దపెద్ద నల్లని కళ్ళని చుట్టూవున్న అద్దాల బీరువాల వెంపు త్రిప్పి త్రిప్పి చూస్తూ కూర్చుంది లీలావతి.

"చాలా రోజులయింది. మీరు వచ్చి!" మళ్ళీ అన్నాడు.



"అవునవును." అంది లీలావతి నవ్వి. నవ్వినప్పుడు, ఆమె సన్నని పెదాల మీద మంచిముత్యాలు మెరుస్తున్నాయి!

"నువ్వు వీళ్ళందరికీ ఏం కావాలో చూడు! నేను ఆమెగారికి ఏం కావాలో 'బాస్'ని అడిగివస్తాను." ఆమె సాన్నిధ్యాన్ని వొదులుకోలేని ఫిరోజ్ అన్నాడు.

"సర్లేవెళ్ళు! ఇంకా షాంలాల్, మున్నీరాం వున్నారుగా!" అన్నాడు అహమ్మద్. తనలో పాపం పసివాడు అనుకున్నాడు అహమ్మద్. ఫిరోజ్ చాలా అందంగా ఉంటాడు. కొత్తగా సేల్సుమేన్‌గా వచ్చాడు. తను చాలా అందమైనవాడినని ఫిరోజ్‌కి తెలుసును. అవకాశంవస్తే ఒక అరిస్టోక్రాట్‌ని ప్రేమించాలనీ, అందమైన సినిమా తార ప్రక్క రొమాంటిక్ హీరోగా నటించాలనీ ఆరాట పడుతున్నాడు. లీలావతిని చూడగానే అతనికి ఆరాధ్యదేవత దిగివచ్చినట్లనిపించింది. నెమ్మదిగా 'బాస్' దగ్గర కెళ్ళి నించుని నెమ్మదిగా.

"ఆమెకేం కావాలి సార్?" అన్నాడు. లల్లూరాం ఫిరోజ్‌ని గమనించలేదు. లీలావతితో సంభాషణలో నిమగ్నమైపోయాడు. లీలావతి ఏదో సోదిగా చెప్పుకపోతోంది. ఫిరోజ్ ఆమె మాట్లాడేటప్పుడు ముఖంలో, మెరిసే హావభావాలను పరిశీలిస్తూ నిలబడ్డాడు.

"ఆరోజు యిక్కడే మొదటిసారిగా కలుసుకున్నాను కేశవరావుని. ఉట్టి దగుల్బాజీరకం అని నేను అనుకోలేదు. ఆ రోజు యెంత పెద్దమనిషిగా వ్యవహరించాడు? మీరే చూశారుగా? తర్వాత రెండు సార్లు, టెన్నిస్‌కోర్టులో కలుసుకున్నాం.





ఒకసారి తనింట్లో పార్టీయిచ్చాడు, దానికి నేను వారం తిరక్కుండానే మళ్ళీ పార్టీయిచ్చాను. ఇల్లా పార్టీలు యిస్తూ, సినిమాలూ, షికార్లూ తిరుగుతూ రెండేళ్ళు గడిపాం. ఇంక ఒకరోజున నేనుఅడిగేద్దా మనుకున్నాను."

"ఏమని?" లల్లూరాం అడిగాడు.

ఆ ప్రశ్నని మనసులోనే వేసుకున్నాడు ఫిరోజ్.

"అతనికి ఊళ్లో రెండు మేడలున్నాయి. గూడూరులో మైకాగనులుకూడా వున్నయ్యంటాడు. అసంగతి మనకి నికరంగా తెలియదు అనుకో! అతని ఆస్తిపాస్తుల విషయం ఎల్లావున్నా, అతని ముఖంలోని స్ట్రయికింగ్ ఫీచర్స్ నన్ను ఆకర్షించాయికాబోల్ను! కనుక అనాలోచితంగా అడిగేశాను. నన్ను పెళ్ళిచేసుకోవటం ఇష్టమేనా? అని. అంతే! నిలువునా నీరయి పోయాడు మనిషి.

“నిజమేనా ? అన్నాడు కేశవరావ్.”

“అబద్ధం ఎందుకు చెప్పాలి! అన్నాను.”

“నాకు చాలా సంతోషంగావుంది. మన స్వంతా దూదిపింజల్లె ఎక్కడికో ఎగిరిపోతూంది. నిజంగా నువ్వు దేవతవి లీలా !” అన్నాడు.

“దేవతనికాను మానవినే !” అన్నాను.

“అప్పుడేం జరిగిందనుకున్నావ్ !” అని ఆగింది లీలావతి.

“ఏం జరిగిందీ ?”

అదే ప్రశ్న అల్లూరాం పైకి అడిగాడు. ఫిరోజ్ మనస్సులో మననంచేసుకున్నాడు.

“అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాం. డేటు కూడా ఫిక్స్‌చేసుకున్నాం. అప్పుడు తెలిసింది ఈ వార్త !”

“ఏవార్త ?”

“అదే ! అతని ఆస్తిపాస్తులమీద, దాయాదు లెవరో దావా చేసేరన్న సంగతి. బతికాను దేముడా ! ముందే తెలిసింది అనుకున్నాను. అంత లక్జూరియస్ లైఫ్ లీడ్‌చేసే వ్యక్తి ఆస్తి అంతా పోతే ఏమవుతాడు ? ఇంక నా ఆస్తిమీదకు దృష్టిమళ్ళిస్తాడు. ఎవరితోనో అన్నాట్టకూడా. నా ఆస్తి పోయినా నాకేం లోటు ? కొన్ని రోజుల్లో లీల నా అధీనమవుతూండగా. ఇల్లాంటి అప్పు లెన్నిఅయినా ఒకగంటలో తీర్చిపారేస్తాను.” ఓరి బంగారు నాయనా ! అనుకున్నాను. “మన వివాహం క్యాన్సిల్ చేసుకుందామోయ్ !” అన్నాను. “ఆచేం ?” అన్నాడు. “నా కిప్పుడప్పుడే పెళ్లాడాలని లేదు.” అన్నాను. తర్వాత ఎక్కడన్నా కనిపించినా, ముఖం ముడుచుకుపోయేవాడు. కాని, ఫార్మల్‌గా విష్‌కూడా చేసేవాడుకాదు. ఇంతలోవుంది అనుకున్నాను. ఆ సంగతి మనస్సులోంచి చెరిపిపారేశాను.” గర్వంగా అంది లీలావతి.

“అంతేమరి !” అన్నాడు అల్లూరాం.

“అమ్మయ్యా !” అనుకున్నాడు ఫిరోజ్.

“ఏం కావాలి మాడమ్ !”

ధైర్యంచేసి ఆమెనే అడిగాడు ఈసారి. లీలావతి అతనికేసి చూసింది. ఒకక్షణం అతనిపచ్చని, విశాలమైన నుదురుమీద, అల్లరిచేస్తూ, కదుల్తూన్న ఉంగరాల జుట్టుకేసి ఆమె దృష్టి నిలబడింది.

“హేండ్‌సమ్ మేన్ ! నేను క్రితంసారి వచ్చినప్పుడు లేడే ? కొత్తగా ఎపాయింట్ చేశావా ?” అంది, అల్లూరాంకేసి తిరిగి.

“అవును. ఇతనువచ్చి ఆర్నెల్లే అవుతోంది.” అన్నాడు అల్లూరాం.

“ఇదివరకు యెక్కడన్నా వర్క్ చేశావా ?” అంది లీలావతి. ఆమె తనతో మాట్లాడటం వించి, ఉల్లాసం కలిగినా, ఏకవచన ప్రయోగానికి - చిన్నపుచ్చుకున్నాడు ఫిరోజ్.

“ధనీరాం షాపులో రెండుసంవత్సరాలు చేశాను.” ముక్తసరిగా అన్నాడు, ఫిరోజ్.

“గుడ్‌గాడ్ ! వాడిదగ్గర రెండేళ్ళు ఎల్లా చేశావోయ్. నాయనా! వాడి కొడుకు నిర్మలచంద్ లేడూ ? వాడూ నేనంటే పడి చచ్చేవాడనుకో ! వాడి తండ్రి. టిరనీ ని నేను భరించలేకనే. అతన్ని వదులుకోవల్సి వచ్చింది. నిజానికి! నిర్మల్‌చంద్ హృదయం నవనీతమనుకో ! కాని ఏం చేయను ?







కన్నకొడుక్కి, ఏవయినా సరదాలువుంటాయని తెలియని, నాయికొక్కుళ్ళ జంతువు ఆ ధనీరాం ! పిల్లలు ఎదిగాక వాళ్ళకి సినిమాలనీ, షికార్లనీ, తిరగాలని వుండదూ ? కాస్త ఆ ఖర్చులకి ‘పాకెట్‌మనీ’ ఇయ్యకపోతే ఎల్లా ! పేరుకి కోటీశ్వరుడే ఆధనీరాం ! కాని ఇంట్లో రోజూ ఆ కర్రపెండలం పిండి రొట్టెలుతప్ప, వేరే వంటకాలే వుండవట. మా ఇంట్లో ‘డిన్నర్’ టైంకి ఎప్పుడన్నా వస్తే. ఆ డిషెస్‌కేసి, వళ్ళంతాకళ్ళుచేసుకుని చూసేవాడు నిర్మల్ !”

“రావోయ్ ! నువ్వు కూడా మీల్స్ తీసుకో” అనేదాన్ని. “వద్దు వద్దు!” అని మొహమాటపడేవాడు. కాని, కళ్ళతోనే ఆ పదార్థాలని తినేసే చూపుని నేను గమనించలేనిదాన్నా ? బలవంతంచేసి తినిపించేదాన్ని.”

“పాపం !” సానుభూతిగా జంటగా అన్నారు అల్లూరాం, ఫిరోజూనూ.

“మా నాన్న ఎన్నాళ్ళువుంటాడు లీలా ! పుట్టికట్టుక పూరేగుతాడా ఏం ? ఆయన కారణంగా నన్ను తిరస్కరించకు లీలా ?” అని బ్రతిమాలాడు.

“అవును అందులో నిజంలేకపోలేదు” అన్నాడు అల్లూరాం. తన కొడుకు అమీర్ చంద్ గుర్తుకువచ్చాడు అల్లూరాంకి.

“అతనికి నామీదవుండే ఆరాధన్ని తృణీకరించలేను. కాని, ఇంటికోడలుగా చేరి, మామగార్ని, మనసులోనే రోజూ శపించుకోవటం, నాకు తప్పనిపించింది. ఆయన పీనాసితనాన్ని అంగీకరించే వ్యక్తే కోడలుగా రావొచ్చును ! అది వాళ్ళ అదృష్టం! నా తత్వానికి పీనాసితనం పడదు. కనుక



మేష్టారు : “చివరకి రాముడు సీత ఎక్కడుందో తెలుసుకున్నాడా ? హనుమంతుడు క్షేమంగా లంకనుంచి తిరిగి వచ్చాడా ? వానర సైన్యమంతా సముద్రందాటగలిగిందా ? మిగతా కథ కోసం రాత్రి హోంవర్కుగా తెలుగు పాఠం చదవండి వెధవల్లాలా,”

నాది నేను ఖర్చుచేసుకుంటాను. కాని ఇతర్లు కూడా నామార్గాన్నే నడవాలనుకోవటం, తప్పుకాదూ ? అదే అన్నాను నిర్మల్‌తో. “నీ నిర్మలానురాగానికి నా హృదయం స్పందిస్తోంది. కాని, నీ ఇంట్లోచేరి, రోజూ ఆ ముసలాయనకి మృత్యువుని ఆహ్వానించటం నాకిష్టంలేదు. అంచేత మనిద్దరం పెళ్ళి చేసుకోవటం కుదరదు.” అన్నాను.

“అవును. మంచిపనిచేశారు” అన్నాడు అల్లూరాం.

“ఆయనకి ఇప్పుడు ఇద్దరు పిల్లలు” అన్నాడు ఫిరోజ్.

“అవును. అప్పటి కప్పుడే వాళ్ళచుట్టాల అమ్మాయిని చేశాడు, ధనీరాం ”

“మామకి తగ్గ కోడలే నండి ఆవిడ.” అన్నాడు, ఫిరోజ్.

"పోన్లే అదృష్టవంతుడు. నాలుక్కాలాల పాటు బ్రతుకుతాడు. ఎందుకనో అంతకూడిక చెయ్యటం! కూచమ్మ కూడబెడితే, మాచమ్మ, మాయంచేస్తుందట! అంత ఇరుకుగా, పిల్లల్ని పెంచితే, ఆస్తి వాళ్ళచేతికి వచ్చిన మర్నాడు, విపరీతఖర్చులు చేసేసి, అడుక్కుపోతారు. పిల్లల్ని మనసు వికసింపచేసి, వాళ్ళ ఆర్థికఅంతస్థులు తెలిసేలా పెంచాలి. అల్లా చేస్తే, వాళ్ళూ సుఖపడుతారు. మన్ని గురించి కఠినంగా అనుకోవటానికి ఆస్కారం వుండదు. వున్న డబ్బంతా మనకోసం, మన తల్లితండ్రులు ఖర్చుపెట్టారు అనే భావన పిల్లలికి కలిగిన్నాడు, ఆ పిల్లలు ఆ తల్లితండ్రులని పూవుల్లోపెట్టి పూజిస్తారు. అంతేకాని కాని డబ్బుకూడా డిబ్బిలోంచి తీయకుండా ఎదిగే పిల్లల సంతోషాలని అరికట్టి పెద్దయ్యాక, ఒక కోటి రూపాయిలు ఇస్తేమటుకు ప్రయోజన మేమిటి? ఆకలేసినప్పుడే అన్నం! డబ్బుకి అనవసర ప్రాముఖ్యత నిచ్చి, డబ్బు యొక్క విలువపెంచినది మనమే!"

"అవునండి! ఇంతకీ మీ కేం కావాల్నో ...." నసిగాడు ఫిరోజ్. ఎంతకీ ఒక గొడవ లోంచి ఇంకో గొడవలోకి అల్లా గొలుసు కట్టుగా మాట్లాడుతుందితప్ప, తన కేం కావాల్నో చెప్పటంలేదు. వ్యాపారం స్తంభించింది. వచ్చినవాళ్ల కాస్సేపు లీలావతినిచూసి సేల్సుమెన్ తమ మాటవినిపించుకోవటం లేదని, కోపగించుకుని పోతున్నారు. లీలావతి వచ్చిన యీమూడు గంటల్లోనూ, వాళ్ళకి, ఒక మీటరు గుడ్డయినా అమ్ముడు కాలా! "అదే, టెరిలీన్ శారీస్ చూపించు! హల్లో!" గుమ్మంకేసి చూశాడు ఫిరోజ్. సన్నగా పొడుగ్గావున్న ఒకమనిషి లోపలికి వచ్చాడు. అల్లూరాం మళ్ళీ కంగారుపడి, బంగారం పళ్ళతో నవ్వి....

"దయచెయ్యండి. దయచెయ్యండి." అని కుర్చీ చూపించి "బోయ్!" అన్నాడు. ఒక సేల్సుమేన్ ద్రాక్షగ్లాసు తెచ్చిఇచ్చాడు. అతను స్తిమితంగా కూర్చున్నాడు. కోటు విప్పి కుర్చీకి తగిలించాడు.

"ఏమిటిమాట్లాడవేం? మర్చిపోయావా?" అంది లీలావతి.

"నువ్వేనా అని అనుమానిస్తున్నాను." సాఫీగా అన్నాడు వచ్చిన వ్యక్తి.

లీలావతి గట్టిగా నవ్వి అంది,

"చూడు అల్లూభైయ్యా! నేనేనా అని అనుమానిస్తున్నాడట!" అల్లూరాం నవ్వాడు.

"ఏం కావాలండీ?" వచ్చినవ్యక్తిని అడిగాడు ఫిరోజ్.

"అతని కేం కావాల్నో నన్నడుగు చెప్తాను. దిండిగల్ చీరెలు, నాలుగ్గజాలు చీటీ పువ్వులగుడ్డా! కదూ నటేశన్?" అంది హేళనగా లీలావతి.

ఇతనిపేరు నటేశన్ అన్నమాట! అనుకున్నాడు, ఫిరోజ్.

నటేశన్, ద్రాక్షజ్యూస్ నిమ్మళంగా పుచ్చుకున్నాడు.

"నువ్వొకసారి లోపలికి రావాలి. అల్లూభాయ్!" అన్నాడు. అల్లూరాం ఇబ్బందిగా ముఖం పెట్టాడు. లీలావతిని వొంటిగా, వొదిలి రావడం యిష్టంలేదు అల్లూరాంకి.

"ఆ సంగతేదో ఇక్కడ్నే చెప్ప కూడదా?" అన్నాడు.

"నాకు వెయ్యిరూపాయిల సరుకు దాకా క్రెడిట్ ఇయ్యాల్సుంటుది" అన్నాడు నటేశన్.





"అల్లాగే. తీసుకెళ్ళండి! ఫిరోజ్! ఈయన్ని తీసుకెళ్ళి ఏంకావాల్నో చూడు" అన్నాడు అల్లూరాం.

నటేశన్ అల్లూరాం ఉదారతకి ఆశ్చర్యపోలేదు. లీలావతి వుందికనుక అంత సులభంగా తనకి అల్లూరాం క్రెడిట్ ఇచ్చాడన్న సంగతి అతనికి తెలియందికాదు. ఫిరోజ్ సగం అయిష్టంగానే, నటేశన్‌ని లోపల వేవు భాగానికి తీసుకెళ్లాడు. నటేశన్ కంజీవరం, ధర్మవరం, బెనారస్ పట్టుచీరలు చూస్తూన్నాడు.

"క్రెడిట్ నా యెదుట అడక్కూడదనుకున్నాడు కాబోలు! పూర్ ఫెలో!" అంది లీలావతి.

"అంతే అయ్యుంటుంది!" అన్నాడు అల్లూరాం.

"ఇంతకీ యిప్పుడు వెయ్యిరూపాయల సరుకు యెందుకంటావు? ఏదన్నా చిన్న బిజినెస్ ప్రారంభం చేయాల్నా?" అంది

"అబ్బే! బిజినెస్‌కి కాదు. ఆయన కూతురికి పెళ్ళట! మొన్న వాళ్ళింట్లో అద్దెకున్న నాయర్ చెప్పాడు. ఏదోమాటల సందర్భంలో. అందుకయి వుంటుంది."

"అల్లాగా!" గంభీరంగా అంది లీలావతి. "ఇతనుకూడా మీరంటే చాలాఇష్టంగా వుండే వాడుకదూ?" అన్నాడు అల్లూరాం.

"అవును అలానే నటించేవాడు!"

"నటనంటారా?"

"కాక మరేమిటి? తీరా నేనూ పోనీ పెళ్లాడుదాం అనే నిర్ణయానికి వచ్చేసరికి, ఒక యాభై వేల రూపాయిలు యివ్వమన్నాడు."

"మిమ్మల్నా?" ఆశ్చర్యపోయాడు అల్లూరాం.

"అవును. ఎందుకోతెల్సా? తనకి నాతో సమానమయిన "స్టేటస్" లేదట! అంచేత తను కంజీవరం, కోయంబత్తూరు, సేలం, మొదలయిన వూళ్లు, వెళ్ళి, అక్కడ హోల్ సేల్‌గా, బట్టలుకొని ఇక్కడ షాపు పెడ్తాడట! దాంతో అతని స్టేటస్ పెరుగుతుందట! అప్పుడు పెళ్ళిచేసుకుంటే ముచ్చటగా వుంటుందట!"

"మీ రేమన్నారు?"

"ఎప్పుడయితే, నేను నిన్ను పెళ్ళి చేసుకుంటానో, అప్పుడే నీకు, స్టేటస్ కలుగుతుంది. అంతకన్నా ఏమిటి? స్టేటస్‌ని కొనుక్కుంటేకాని పెళ్ళి చేసుకోని పక్షంలో, నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు."అన్నాను. చచ్చినట్లు తప్పుకున్నాడు. ఎక్కడ కనిపించినా మనస్సు విప్పి మాట్లాడలేడుకద! వెధవ కుళ్ళుబోతు సమాధానాలు ఇస్తాడు. నాకు వళ్ళమండుకవస్తుంది" అంది కోపంగా లీలావతి. లోపల్నుంచీ ఫిరోజ్, నటేశన్ వచ్చారు. నటేశన్ చేతులో వెయ్యిరూపాయల సరుకువుంది. ఫిరోజ్ కొన్ని టెరిలీన్ చీరలుకూడా లీలావతి కోసం తీసుకవచ్చి, లీలావతి కుంచున్న బల్లమీద పరిచాడు. అహమ్మదు కాతా పుస్తకం తీసుకవచ్చి అల్లూరాంకి ఇచ్చాడు. అల్లూరాం నటేశన్ ఏయే బట్టలు ఖరీదు చేసినదీ అడిగి వ్రాసుకున్నాడు.

"మీ అమ్మాయి పెళ్ళట?" అంది.లీలావతి. "అవును," ముక్తసరిగా అన్నాడు నటేశన్.

"మాటమాత్రం చెప్పకూడదా ఏమిటి?" అన్నది లీలావతి.

"ఇంకా ఇన్విటేషన్స్ పంపించలా ఎవ్వరికీనూ!" అన్నాడు.

"రేపొకసారి మా ఇంటికేసిరా!" అంది లీలావతి.

"'అల్లాగే" అన్నాడు నటేశన్.

"మర్చిపోక తప్పకుండా రా!" మళ్ళీ అంది లీలావతి.

"నువ్వు పిలుస్తే మరుపా? ఎంతమాట· నిన్ను మర్చిపోతే నన్ను నేనే మర్చిపోయినట్లు!" అన్నాడు.

"ఆమాటలు పోనిచ్చుకున్నావుకాదు" అంది లీలావతి.

"ఏ మాటా పోనిచ్చుకునే వుద్దేశ్యం నా కెప్పుడూలేదు. మరి వస్తా! వస్తా అల్లూ భైయ్యా!"

వెళ్ళిపోయాడు నటేశన్. రాత్రి పదిన్నర అయిపోతోంది. సగం బజారంతా ఖాళీ అయిపోతోంది. సేల్సుమెన్ వూరికే విసుక్కుంటున్నారు. రోడ్డుమీద అప్పుడో కారూ-ఇప్పుడో కారూ పోతున్నాయి.

ఫిరోజ్ 'ఇవిగోనండి. టెరిలీన్ చీరలు" అన్నాడు. లీలావతినెమ్మదిగా ఒక్కొక్కటీ విప్పి చూస్తోంది. పమిటిచెంగుకు గజంపైర జరీ అంచు, చుట్టూ దోసెడు వెడల్పు జరీ అంచు వున్నయ్ ఆ చీరలకి. ముదురు ఎరుపు, లేక నీలం, పసుపు, లేత ఆకుపచ్చ మొదలైన రంగుల్లో వున్నాయి ఆ చీరలు. ఫిరోజ్‌కి, ఆమె లేత పసుపు చీరకట్టుకుంటే చూడాలనిపించింది. ఆమె వేసుకున్న జాకెట్ ఆమెవంటి రంగులో కలిసిపోయి, ఆమె జాకెట్ వేసుకోలేదేమో అనే భ్రమ కలిగిస్తోంది ఫిరోజ్‌కి. చీరకూడా అల్లాంటిదే కట్టుకుంటే!!

లీలావతి తెల్లని చీరలు రెండూ, లేత గులాబి చీరలు రెండూ, లేత నీలంచీరలు రెండూ తీసింది.

"ఇంక ఇవి చాల్ను! డెకరాన్ శారీస్ చూపెట్టు!" అంది లీలావతి. పసుపురంగు చీరలు తీయకపోవటంతో హతాశుడైనాడు ఫిరోజ్.

"పసుపురంగు తీయలేదు మీరు! అది ఎంతో బాగా వుంటుంది మీకు: ఆ పచ్చని చీరతో ఇప్పుడు మీరువేసుకున్న జాకెట్ వేసుకుంటే దేవతాస్త్రీలా వుంటారు" వినయంగా భక్తిగా అన్నాడు ఫిరోజ్.

లీలావతి గర్వంగా నవ్వింది. ఆమె చెంపలు గులాబీరంగుతో సొట్టలుపడ్డాయ్· నల్లని చారెడేసి కళ్ళు నక్షత్రాలల్లె మెరిశాయ్.

"ఈ చీరలు నాకుకాదులే! మా అమ్మాయికి! మా అమ్మాయి నల్లగా వుంటుంది. తండ్రి పోలిక వచ్చింది. దానికి! రేపు పుట్టిన రోజు, అంచేత పార్టీకి వుంటాయి అని కొంటున్నాను. మళ్ళీ కాలేజీకి బోయేరోజు లొచ్చాయిగా! అందుకని ఏకంగా కొంటున్నాను," అంది లీలావతి.

"రేపు మీ అమ్మాయి పుట్టినరోజా!' అన్నాడు అల్లూరాం.

"అవునోయి. కార్డ్సు యింట్లో మర్చిపోయాను. రేపు మీస్టాఫ్ అంతటినీ తీసుకు పార్టీకిరా!" అంది.

"చదువుకుంటూందా?"

అన్నాడు అల్లూరాం.

"ఆఁ నాగపూర్‌లో యం. ఎ. చదువుతోంది!" అంది లీలావతి.

నీరసంగా డెకరాన్ చీరలున్న బీరువా వేపు కదిలాడు ఫిరోజ్!

లీలావతి వాళ్ళ అమ్మాయి మంచితనాన్ని గురించీ, వాళ్ళ నాన్నకి(అంటే తన భర్తకి) తనమీదవుండే అపార ప్రేమను గురించీ మాట్లాడుతోంది. అల్లూరాం వింటున్నాడు.

□□□





# హలో! హలోహలో!



# అప్పలరాజూ అప్పులురాజూ

చాలాకాలం తర్వాత ఆగొంతు వినిపించింది. చటుక్కున వెనుతిరిగి చూశాను.

తపీమని అంతవరకు విచ్చివున్నగొడుగు మూతపడిపోయింది. ఆ గొడుగు చాటునించి ముఖం కనిపించింది. అప్పలరాజు!

అప్రయత్నంగా నా పెదవులమీద చిరునవ్వు మొలకెత్తింది! "ఏమిటోయ్ మా ఇంటివైపు రావడం మానేశావ్?" అన్నాను అనాలోచితంగానే.

"మీ ఇల్లు చాలా దూరమైపోయిందోయ్!" చూస్తూండగానే అప్పలరాజు ముఖంలో విచార జీమూతాలు అలముకున్నాయి.

"అంటే, నువ్వు వేరేఇంటికి మారావా?"

"ఛా - ఛా .... నేను ఆ ఇల్లు మార్చడమే! ఈ జన్మలో మళ్ళీ అలాంటి ఇంటావిడ-సారీ-ఇల్లుగలావిడ దొరకొద్దూ?"

"మరి మా ఇల్లు నీకు ఎలా దూరమైంది?"

"మీ వీధి ఇప్పుడు వన్ వే ట్రాఫిక్ అయిందిగా?"

"ఐతే ఏం—మార్కెట్.వీధివైపు నించి రావొచ్చుగా?"

"అక్కడే వచ్చిందయ్యా చిక్కు."

"అదేమిటీ?"

"అవైపు వీధి మొగదలలో ఒక పత్రిక అమ్మే కొట్టును పోయిన సంక్రాంతినాడు ఎవరో తెరిచారుగా?"

జి. వి. జి.